
# మనుష్య తీయకు

- శ్రీమతి పి.వి.శేషారత్నం



‘అందరికంటె వెనుక వరసలో కూర్చుని స్వామీజీని పరిశీలనగా దీక్షగా చూస్తున్నాడు సుందరం.

భక్తుల ధ్యానంలో గొంతు ఆయన కాళ్లకి మొక్కి [illegible] పాదపూజ చేసి...కోరికలు విన్నవించుకుంటూనే... ఆయన [illegible] కళ్ల కద్దుకుని తమకు తోచినది కనీసం ఐదువందల రూపాయలకు తక్కువ కాకుండా సమర్పించి మరీ వెళ్తున్నారు. జనానిది వేలంవెర్రో... లేక ఆ స్వామీజీకి నిజంగా కోరికలు తీర్చే శక్తి ఉందో సుందరానికి అర్థం కాలేదు.

ఆరోజు మధ్యాహ్నం లంచ్ తర్వాత ఆఫీసులో ఒక్కొక్కళ్లు వచ్చి ‘సార్ చాలా అర్జంటు పనుంది. త్వరగా వెళ్లడానికి హాఫ్‌డే పర్మిషన్ ఇవ్వండి’ అంటూ చేతులు నలుపుకుంటూ అడుగుతుంటే... బాస్‌గా కాస్త గర్వంగా ఫీలయ్యాడు సుందరం... కానీ ఇంతమందికి ఇవాళే హాఫ్‌డే పర్మిషన్ రాజేశ్వర్రావు కూడా పర్మిషన్ అడిగేసరికి ఇంక ఆపుకోలేక అడిగేసాడు.

‘రాజేశ్వర్రావుగారూ...ఇవాళ ఎవరిదయినా పెళ్లి ఉందా? వరసగా అందరూ పర్మిషన్ అడుగుతున్నారు?’’

కాసేపు నసిగి నసిగి చివరికి అసలు విషయం చెప్పాడు హెడ్‌క్లర్క్.

‘ఊర్లోకి కామితార్థ స్వామీజీ వచ్చారు సార్... ఆయనను దర్శించుకుని మన కోరికలు విన్నవించుకుంటే మనకి విబూది ఇస్తారు.’

‘మీరు ఆయనకి డబ్బులు కూడా ఇస్తారు. అవునా?’ అన్నాడు సుందరం వెటకారం ధ్వనింపజేస్తూ.

‘లేదు సార్ ఆయన డబ్బు ఆశించరు. కోరికలు తీరడంకోసం పాదపూజ చేసేవారు మాత్రం ఐదువేలు సమర్పించుకుంటారు. అంతే... ఆయన దేశమంతా తిరిగారు. ఆయన దీవిస్తే కోరికలు తీరకపోవడమంటూ ఉండదుట. మా అమ్మాయికి ఏ సమ్మందమూ కుదరడం లేదు... దానికి పెళ్లి ఎప్పుడు కుదురుతుందో తెలుసుకోవడానికి నేనూ వెళ్తున్నాను.’

సుందరానికి స్వామీజీల మీద భక్తిలేకపోయినా ఇంత మంది కోరికలు తీరుతున్నాయంటే... ఆయనలో ఏదన్నా విశేషమయినా ఉండి ఉండాలి... లేదా... కనికట్టులాంటిది ప్రయోగిస్తున్నాడో?... తను కూడా సరదాకి వెళ్తే పోలా? అనిపించింది. స్వామీజీ దగ్గర తమ బాస్‌ని చూసి సుందరం దగ్గర పనిచేసే ఉద్యోగులు ఓ క్షణం కంగుతిన్నట్టుయినా... అతనూ తమలాగే ఏదో కోరిక కోరుకోడానికే వచ్చి ఉంటాడని సంబరపడి సర్దుకున్నారు.

దాదాపు అందరి వంతు అయ్యేదాకా సుందరం కదల్లేదు... అందరూ స్వామీజీకి మొక్కడం... ఆయన ముందు కోరుకోవడం... విబూది తీసుకోవడం... తోచినంత డబ్బు ఆయన పాదాలవద్ద ఉంచి వెళ్లడం... ‘నీకేం కావాలి నాయనా?’

ఉలిక్కిపడ్డాడు సుందరం. అంతవరకు తనకేం కావాలో ఆలోచించనే లేదు. తనకి అన్నీ ఉన్నాయి... అనుకూలవతి అయిన భార్య, సంపద... కొడుకు... ఏం అడగాలి? ఒకే క్షణం ఆలోచించాడు... ఏదన్నా తమాషాగా కోరుకుంటే? ఏం కోరుకోవాలి. ఆ... తన గురించి ఇతరులేమనుకుంటున్నారో తెలుసుకోవాలి. ఎందుకంటే...అన్నీ ఉన్న తనని ఎదురుగా అందరూ గౌరవిస్తారు. అది నిజమేనా కాదా? ఇంతలో చిత్రంగా ఆరోజు ఉదయం పేపర్లో చదివిన వార్త సుందరానికి గుర్తొచ్చింది.

“మార్చి 13, 2009: ఇప్పటివరకు మీ ఆలోచనలు జ్ఞాపకాలు మీకే సొంతం కానీ అది ఇంకెంతో కాలం కాదు. ఎప్పటినుంచో మెదడుపై పరిశోధనలు జరుపుతున్న లండన్ యూనివర్శిటీ కాలేజ్ శాస్త్రవేత్తలు ఇపుడు మెదడు చదివే పరిజ్ఞానంలో ఆలోచనలకు దృశ్యరూపం ఇవ్వడంలో విజయం సాధించి మరో ముందడుగు వేసారు. వీరు తమ పరిశోధనల్లో భాగంగా ముందుగా నలుగురు వాలంటీర్లను ఎంపిక చేసి ఒక్కొక్కరిని ఒక్కో కంప్యూటర్ ముందు కూర్చోబెట్టి... వారి తలలు ఫంక్షనల్ మేగ్నటిక్ రిసొనెన్స్ ఇమేజింగ్ స్కానర్‌లో ఉండగా స్కానర్ సాయంతో హిప్పోకాంపస్ ప్రాంతంలోని రక్తప్రవాహ తీరును రికార్డుచేసి తరువాత ఆ ఫలితాలను అత్యంత ఆధునికమైన సాఫ్ట్‌వేర్ సాయంతో విశ్లేషించి వారి ఆలోచనలను చదవ గలిగామని నేతృత్వం వహించిన ఎలీనార్ మగ్వైర్ తెలిపారు. ఆ పరిజ్ఞానం అందుబాటులోకి రావాలంటే మరో పదేళ్లు పడుతుంది.’’

‘నీది విపరీతమైన కోరికే అయినా నువ్వనుకున్నది ఈ క్షణంనుంచే తప్పక ఫలిస్తుంది నాయనా...నీకు పర హృదయ ప్రవేశమనే విద్యననుగ్రహిస్తున్నాను. కాక పోతే...విషయం తెలిసింది కదా అని నువ్వు ఎదుటివాళ్ల మీద ఎలాంటి ప్రతిచర్య తీసుకోకూడదు. అలా తీసుకుంటే ఆ తర్వాత ఇది ఫలించదు. అంతేకాదు నీ మనోవాంఛితం ‘‘మరి అవసరం లేదు’’అనుకున్న క్షణాన ఈ శిలను నీళ్లలో నిమజ్జనం చెయ్యి’ సుందరం ఆశ్చర్యం నుంచి తేరుకోకుండానే అతని చేతిలో ఓ జేగురు రంగు రాయిని పడేసారు స్వామీజీ...

తను మనసులో అనుకున్నది స్వామీజీకి ఎలా తెలిసిపోయింది?... నిజంగా ఈయన శక్తివంతుడయి వుండాలి. సుందరం భక్తిగా తన స్థాయిని తెలిపేందుకు... పది... వెయ్యి రూపాయల నోట్లు ఆయన పాదాల ముందుంచాడు గొప్పగా...

అలా ఉంచి స్వామీజీ కళ్లలోకి చూసాడు. ఆయన పెదవులు కదలడం లేదు కాని ఆయన గొంతు తన చెవిలో వినిపిస్తోంది...

‘డబ్బుతో స్థాయిరాదు నాయనా... శిల జాగ్రత్త.’

ఉలిక్కిపడి మళ్లీ ఆయనకేసి చూస్తే... దీవిస్తూ వెళ్లి రమ్మన్నట్టు సైగ చేసాడు...

* * *

హుషారుగా ఇల్లు చేరాడు సుందరం. గేటు తీసి సలాం కొట్టాడు వాచ్‌మన్.

‘వీడి మొహం సంతకెళ్లా... అర్ధరాత్రీ లేదు, అపరాత్రీ లేదు. రోజూ ఇంత పొద్దుపోయేదాకా తాగి తందనాలాడుతూ వస్తాడు’.

కారు గేరేజ్‌లో పెడుతూంటే చెవిలో వినిపించిన మాటలకు ఉలిక్కిపడ్డాడు సుందరం.

ఎవరు తిట్టేది? ఇక్కడ తను... గూర్ఖా తప్ప ఎవరూ లేరు. అంటే...వీడు...రోజూ తనని ఇలాగే తిట్టుకుంటూ గేటు తీస్తాడన్నమాట... వంగి వంగి సలాములు కొట్టే గూర్ఖా... బద్మాష్... ఏదో అనబోయిన సుందరానికి స్వామీజీ షరతు గుర్తొచ్చింది.

‘పోనీ... వెధవని ఈసారి పండగ ఈనాం అడగనీ చెప్తాను’. అనుకున్నాడు.

నిద్ర కళ్లతో తలుపుతీసింది భార్య పర్వత వర్ధని. నుదుట పెద్ద కుంకుమ... ప్రశాంతమైన మొహం... పూర్వకాలపు మహా పతివ్రత లాంటి భార్య దొరికినందుకు సుందరం గర్వపడని రోజు లేదు. తన జీవితం వడ్డించిన విస్తరి. మంచి చదువు... గెజిటెడ్ హోదాగల ఉద్యోగం... పెదవి విప్పని భార్య... ముత్యంలాంటి కొడుకు... ఇంటాబయటా ‘‘మంచివాడు’’అనే పేరు... మనిషికి అంతకంటే ఏంకావాలి? ఆఫీసులో తనంటే ఫాన్సీ ఉన్న స్టెనోతో, ఇంట్లో భార్యతో, క్లబ్‌లో వనజాక్షితో మంచి కాలక్షేపం.

‘దేభ్యం మొహం వేసుకుని తయారయ్యాడు’ అన్నట్టు చెవిలో ఓ స్త్రీ కంఠం... అది తన పెళ్లాం గొంతు... చెంపన ఛెళ్లుమని కొట్టినట్టయింది... సుందరానికి. కానీ ఆమె పెదాలు కదలడంలేదు. అంటే మనసులో అనుకుంటోందన్నమాట.

‘ఉలిక్కిపడకు... ఇంత లేటుగా వచ్చిన నీకు... నీ భార్య మనసులో మాట...’ సుందరం మనసు వివరించింది.

సుందరం మొహం కోపంతో ఎర్రబడింది. కానీ స్వామీజీ షరతు గుర్తొచ్చింది.

టై విప్పుకుంటోంటే... తన కాలి బూట్లు విప్పి ఎంతో ఆప్యాయంగా నుదుటిమీద చెయ్యి వేసింది పర్వత వర్ధని.

‘ఏం అలా ఉన్నారు? ఏమైనా గొడవ జరిగిందా?’- ప్రేమ నటించే ఆ గొంతులో ఎంతటి ప్రశాంతత...ఆశ్చర్యపోయాడు సుందరం. ‘అబ్బే ఏం లేదు. వడ్డించు. ఆకలిగా ఉంది.’

‘ఇంక ఘటోత్కచుడిలా మింగుతాడు. నువ్వు తిన్నావా అని ఒక్క ముక్క లేదు... పరమ స్వార్థపరుడు. వీడి

ఉద్యోగం చూసి మా నాన్న నా గొంతు కోసాడు.'

నోట్లో ముద్ద పెట్టుకుంటున్న సుందరానికి పొలమారింది. తల ఎత్తి పైకి చూస్తే పర్వతవర్ధని మొహం ప్రశాంతంగా ఉంది.

'పర్వతం...!' వక్కముక్క నములుతూ భార్యని తన పక్కకి రమ్మని సైగ చేసాడు.

'వర్ధనీ అని ముద్దగా పిలిచి ఏడవచ్చుగా... నలభై దాటుతున్నాయి. ముసలాడినయిపోతున్నానని వెధవ కాంప్లెక్సు. పైకి మాత్రం సినిమా హీరోలా వెధవ శృంగార రస నాయకుడి పోజు'. భార్య చెంపని సుతారంగా చుంబించబోయిన సుందరం వెనక్కి తగ్గాడు.

'ఛ...ముద్దు పెట్టుకోవాలన్నా ముప్ఫయిసార్లు ఆలోచన... ఏమిటో జీవితం గాడి తప్పింది... ఈ ప్రబుద్ధుడిని చేసుకుని.'

మళ్లీ భార్య మనసులో మాటలు వినిపించి సుందరానికి మతిపోయింది. తను ఆడించినట్టల్లా ఆడే భార్య మనోగతం ఇదా?

'స్వామీజీ'అని పళ్లు పటపట కొరికాడు... కోపంగా అరిచాడు.

'ఏమిటండీ అంత గట్టిగా అరిచారు. హడలిపోయాను. స్వామీజీ అన్నారేంటి?'

గోముగా భయం నటిస్తూ అతన్ని అల్లుకుపోయింది పర్వతవర్ధని. ఒక బావురు కప్ప తనని చుట్టుకున్నట్టనిపించి ఒళ్లు జలదరించింది సుందరానికి.

❊ ❊ ❊

అలవాటుగా ఆఫీసుముందు కారు ఆపి అక్కడ ఎప్పుడూ నిలబడే బిచ్చగాడికి యాభై పైసల బిళ్ల వేసాడు సుందరం దర్జా వలకబోస్తూ... బిచ్చగాడి ముఖం ఎప్పటిలాగే వెయ్యి కేండిల్ బల్బులా వెలిగింది. 'ధర్మప్రభువులు' అంటూ వెళ్లిపోయాడు.

తృప్తిగా ఊపిరి పీల్చుకోబోయిన సుందరం చెవి ముందు ఒక కంఠం...

'ఎప్పుడో యాక్సిడెంటయి ఛస్తాడు. రోజూ అర్ధరూపాయి తప్ప ఒక్కనాడయినా రెండ్రూపాయలెయ్యడు.. కారు షోకే తప్ప డబ్బులు రాలవు వెధవకి. క్లబ్బుల్లో ఏలకిఏలు తగలేస్తాడు.' బిచ్చగాడి కంఠం రెచ్చిపోతూంటే... సుందరానికి చిర్రెత్తింది.

ఉదయంనుంచీ ఉన్నదే అది. రాత్రి భార్య మనసులో మాటలు తెలిసిన తనకి పొద్దుటే పెళ్లాం మొహం చూడాలనిపించలేదు.

'పేరెంట్స్ డే'కి రావడానికి వీలుపడదన్నాడని, కొడుకు... నిండ పదేళ్లు లేవు, ఎంత మాట తిట్టుకున్నాడు తనని.

'నాకూ ఒక మనసుందని అనుకోని ఈ తండ్రిని ఎందుకు గౌరవించాలి. ఎప్పుడూ క్లబ్బు... పేకాట... ఆ వనజ ఆంటీ తప్ప వీడికేం అక్కర్లేదు'. తనని "వీడు" అంటాడా కుర్రకుంక?

ఆఫీసుకి బయల్దేరుతూంటే స్నేహితుడు సుధాకర్ వచ్చాడు. తనకున్న స్నేహితుడు వాడొక్కడే... సుధాకర్‌కి జీతం తక్కువ, కుటుంబ భారం ఎక్కువ... ఎప్పుడైనా చేబదులుకి వస్తాడు. నిజంగా అప్పుడు ఇంట్లో డబ్బులేదు. 'ఆఫీసుకి వస్తే అక్కడ ఇస్తాను' అన్నాడు తను.

పైకి మాత్రం "అలాగే"అని వెళ్లిపోతూ వాడు మనసులో అనుకున్న మాటలకి తన మనసు కష్టపడింది. కాని వాడు ఎంతమాట అనేసుకున్నాడు. 'రోగం నీ కొడుక్కి వస్తే? అపుడు నా అవసరం తెలుస్తుందిరా. నీ దగ్గర డబ్బు లేదా? ఆఫీసులో ఏ స్టెనోనడిగి ఇస్తావురా నా పరువు తీసేందుకు..' మనసు కకావికలైంది.

ఆఫీసులో వంగి వంగి సలాములు కొడుతున్న ఉద్యోగుల వందనాలు అందుకోలేదు సుందరం. 'వాళ్లందరు అనుకునేవి వినిపిస్తే'- మనసు హెచ్చరించింది. 'అక్కర్లేదు' అప్రయత్నంగా కోపంగా అరిచాడు.

'ఏంటి సార్! ఫైలు మీరే తెమ్మన్నారుగా'- హెడ్‌క్లర్కు రాజేశ్వర్రావు ఏదో చెప్పబోయాడు.

'అవును కదూ! కూర్చోండి.'

'రాత్రి మందెక్కువయినట్టుంది.' చెవిలో హెడ్‌క్లర్కు కంఠం...

'ఏమిటంటున్నారు?' అన్నాడు సుందరం విస్తుపోయి.

'నేనేం అనలేదే!' హడలిపోయాడు హెడ్ క్లర్కు. నా మనసులో మాట వీడికెలా వినిపించిందిరా దేవుడా అనుకున్నట్టు అతని ముఖంలో బేజారు...

లంచ్ అవర్‌లో తన టిఫిన్ బాక్స్ తెరిచి స్వీటు అందించిన స్టెనో సన్నగా నవ్వింది బాస్ సుందరాన్ని చూసి... 'ఇవాళ నా బర్త్‌డే సర్!'

'మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే' స్టయిల్‌గా హుషారుగా అన్నాడు సుందరం.

'ఉత్తి కబుర్లు తప్ప ఓ ఖరీదైన ప్రెజెంటేషన్ కొంటాను... బజారుకెళ్దాం అనడు ముసలాడు... రోజూ వీడి ముసలి మొహంచూస్తూ చెమట కంపు భరించడమే నా ఖర్మ!'

'ఇదన్నమాట నీ మనసు...పైకే అనేసాడు పళ్లు బిగించి... సుందరం...

'ఏంటి సర్ గొణుక్కుంటున్నారు. మీ అభిమానమే నాకు ప్రెజెంటేషన్... పొరపాటున ఏదయినా కొన్నారు కనుక.' - చిలిపిగా నవ్వింది స్టెనో...

రోజంతా అలాగే గడిచింది... సుందరానికి... సెలవివ్వడం కుదరదన్నాడని క్లర్కు తిట్టుకున్న తిట్లు, ప్యూన్ మాటలు... పిచ్చెక్కిపోయింది.

అంతా తనను మంచిగా అనుకోవాలి అని ఎంత పాటు పడేవాడు? చివరికిదా వీళ్ల మనోగతం?

ఆఖరికి ప్రాణం విసిగిపోయి, ఆఫీసు అయిపోయే ముందు భయపడుతూ వచ్చిన ప్యూన్‌కి అడిగిన వెంటనే లీవ్ గ్రాంట్ చేసేసాడు.

'చవట వెధవ...లీవ్ ఇవ్వకపోతే యూనియన్‌లో పెట్టి... గడ్డి తినిపిస్తానని భయం.'

పైకి మాత్రం వాడు తన కాళ్లు పట్టుకుని 'మీరు కరుణామయులు సర్!' అన్నాడు వెధవ నవ్వొకటి నవ్వుతూ...

సుందరానికి నీరసం వచ్చేసింది.

❊ ❊ ❊

ఇంటికెళ్లేసరికి మావగారు, ఆయన స్నేహితుడు కాబోలు మరో ముసలాయన ఉన్నారు.

'ఏం మావగారూ బాగున్నారా?'

'బాగున్నానయ్యా నువ్వేమిటలా చిక్కిపోయావు?' అన్నాడాయన.

ఏదో చెప్పబోయిన సుందరం ఆగిపోయాడు. మావగారి మనసు వినిపించి...'రుబ్బురోల్లా ఉన్నావు. పెళ్లయిన దగ్గర్నుంచీ ఇప్పటికీ కొత్త పెళ్లికొడుకులా పండుగలూ పబ్బాలూ అంటూ... కారు, ఇల్లు, బట్టలు, ఫ్రిజ్ సమస్తం నాచేత కొనిపిస్తూనే ఉన్నావుగా. నీకేం తెగులా?' కూడా వచ్చినాయన ఇల్లు పరిశీలనగా చూస్తూ అన్నాడు.- 'ఈ ఇంటికెంతయింది నాయనా?'-

'పాతిక లక్షలు... బాగుందాండీ?' సుందరం మాటల్లో గర్వం...

'ఎందుకు బాగుండదు? కుబేరుడులాంటి మావగారు. పైగా ఆఫీసులో బాగానే లంచాలు మేస్తున్నట్టున్నావ్... బాగానే కడుతున్నావ్ మేడలూ మిద్దెలూ.'

'నోర్మూయ్యరా వెధవా?' కడుపు మండిపోయి సుందరం అరిచిన అరుపుకి వచ్చినాయన బిత్తరపోయాడు. మావగారు అయోమయంగా చూసాడు.

'రాత్రినుంచీ ఇదే వరస నాన్నా! ఏ గాలైనా సోకిందో... లేక... ' తండ్రి దగ్గర గారాలు కురిపించింది పర్వతం...

మనసు పూర్తిగా పాడయిపోయి... ఏమీ తినకుండానే లేచాడు సుందరం.

'అదేమిటయ్యా వెళ్లిపోతున్నావు?' మావగారు గాభరాగా అంటున్నా వినకుండా క్లబ్బుకెళ్లిపోయాడు సుందరం... పేకాటలో మాత్రం నాలుగువేలు గెలిచాడు. 'ఏమిటండోయ్ ముక్కల్లోకి చూసి ఆడుతున్నట్టే ఉంది వాళ.'

పరంధామ్‌గారి కామెంటుకు ఉలిక్కిపడ్డాడు సుందరం... నిజంగానే అవతలివాళ్ల చేతిలోని పేకముక్కల్లో ఏముందో వాళ్లు మనసులో అనుకునే మాటలని బట్టి తెలిసిపోతోంది సుందరానికి...

కాని వెంటనే అతని మూడ్ పాడయ్యే మాటలు వినబడ్డాయి. అతను బాత్‌రూంలోకి వెళ్తోంటే, 'షుగర్ కంప్లయింటేమో!'- అది సుబ్బారావు గొంతు... తల తిప్పి చూస్తే వనజ ఇటే చూస్తోంది... వెటకారంగా... నవ్వుతున్నట్టు...

పరహృదయ ప్రవేశ విద్యతో పేకాట గెలిచినా సంతోషంగా లేదు సుందరానికి.

బాత్‌రూంలోకి వెళ్తోంటే, 'ఒరేయ్...'అని వినిపించేసరికి బెదిరిపోయాడు సుందరం. కొంపదీసి ప్రాణంలేని వస్తువుల మనోభావాలు కూడా చెప్పదు కదా ఈ విద్య అని. మహాచెడ్డ చిక్కుగా ఉందే...

ఇవాళ క్లబ్బులో మిత్రులు కూడా తననో శత్రువులా చూసారు. ఇంట్లో ఇల్లాలు సరేసరి... ఆఫీసులో... చెప్పనే అక్కర్లేదు.

ఒక్కరోజుకే పరహృదయ ప్రవేశ విద్యమీద సుందరానికి ఆసక్తి నశించింది.

అన్నింటికీ నాగరికత అన్న ముసుగు ఉంటేనే నయం... మన గురించి ఇతరుల మనోభావాలు తెలుసుకుంటే మనడం కష్టం... నాగరికత ముసుగే లేకపోతే ప్రతివాడూ 'తనకిలాగే బావుంది...' అని లుంగీలతోనో... నైటీలతోనో... వీధుల్లోకి... ఆఫీసులకి... వచ్చేస్తే... నోటికొచ్చినట్టు వాగేస్తే... ఎంత రోతగా ఉంటుంది... అన్న నిర్ణయానికి వచ్చి స్నానానికి సముద్రం దగ్గరకి వెళ్లి స్వామీజీ ప్రసాదించిన... జేబులోని జేగురు రంగు రాయిని స్నానం చేస్తున్నపుడు నీళ్లలోకి విసిరేసాడు సుందరం. "హమ్మయ్య పీడ విరగడయ్యింది" అంటూ...

'ఏవండోయ్ లేవండీ... ఎవరి పీడ విరగడయ్యింది అంటున్నారు. ఇవాళ ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ ఉందన్నారుగా... లేచి తెమలండి.'

సుందరం అయోమయంగా కళ్లుతెరిచాడు... ఎదురుగా పర్వత వర్ధని కాల్గేట్ టూత్‌పేస్ట్ అడ్వర్‌టైజ్‌మెంట్‌లో లాగా పదహారు పళ్లూ బయటపెట్టి నవ్వుతోంది.

★


రచయిత్రి చిరునామా:

**శ్రీమతి పి.వి.శేషారత్నం**

రేడియో అనౌన్సర్,

ఫ్లాట్: బి.404

ఎ.యన్.హెచ్. అపార్టుమెంట్స్, 5, రెడ్‌హిల్స్,

హైదరాబాద్- 500 004.